ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఉపాధి హామీ పథకం పనులు చేసిన ఉపాధి కూలీలకు బకాయి పడ్డ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆదివాసీగిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, మండల, పంచాయతీ పరిధిలో గల గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన గోతులు, మొక్కలు నాటిన పనుల బకాయిలు బిల్లులు అందక ఉపాది కూలీలు ఆర్థాకలితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు తొమ్మిది వారాలు చేపట్టిన బకాయిలు బిల్లులు చెల్లించాలని అయన కొరారు. ఈ కార్యక్రమంలో పి మోహన్ దాస్, సద్దు, దనుర్జాయ్, జగన్నాధం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

-సిఐటియు ఆధ్వర్యాన ఐటిడిఎ వద్ద ఆందోళన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గ్రామ వాలంటీర్ లను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు వాలంటీర్లకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ గేటు వద్ద శుక్రవారం గ్రామ వాలంటీర్‌లు ఆందోళన చేశారు. అంతకుముందు జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుంచి సినిమా హాల్ మీదుగా ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించారు. ఐటిడిఎ గేటుకు చేరుకుని అక్కడే సుమారు గంటపాటు ధర్నా చేశారు. వాలంటీర్ లను రెన్యువల్ చేసి యధావిధిగా విధుల్లోకి కొనసాగించాలని, గౌరవ వేతనంగా రూ.10వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ ధర్నాలో వాలంటీర్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికలలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను నిల బెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతగా సిఎం చంద్రబాబు వాలంటీర్‌లను ఆదుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాలంటీర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తక్షణం గ్రామ వాలంటీర్ లను విధుల్లోకి తీసుకోకపోతే రాజధాని కేంద్రంగా ఉద్యమం తీవ్రతరం తప్పదని, సిఐటియు వాలంటీర్ లకు అండగా ఉంటుందని తెలిపారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మన పడాల్, మహిళా సంఘం కార్యదర్శి హైమావతి మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వాలంటీర్ లు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న వాలంటీర్లు, సిఐటియు నేతలు



మాట్లాడుతున్న సిఐటియు నేత ఉమామహేశ్వరరావు

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి-చింతపల్లి : పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎగ్జామినేషన్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ శశి కుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చింతపల్లి బాలుర వన్, బాలుర టూ, గర్ల్స్ హైస్కూల్, జెడ్పీ హైస్కూల్‌లను సందర్శించారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు దూరవిద్యలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల పరీక్షల కోసం కూడా ఈ కేంద్రాలను వినియోగించనున్నట్లు తెలిపారు. బాలుర టూ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడిన ఆయన, పరీక్షలపై భయం వీడాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. తరువాత ఉపాధ్యాయులతో సమావేశమై ఈ ఏడాది పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో బోధన కొనసాగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 పనసల ప్రసాద్, ఎంఈఓ-2 బోడం నాయుడు, ప్రధానోపాధ్యాయులు కె.అర్జున్, పలువురు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలను సందర్శిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

పివిటిజి గ్రామాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: పీఎం జన్ మాన్ పథకంలో భాగంగా అన్ని పివిటీజి గ్రామాల్లో 11 రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని అల్లూరి జిల్లా పాడేరులో శుక్రవారం స్పందన కార్యక్రమంలో సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు ఆధ్వర్యంలో గిరిజనులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, పీఎం జన్ మన్ కింద 11 రకాల అభివృద్ధి పనులు చేయవలసి ఉండగా ఒక్క హౌసింగ్ పనులు మాత్రమే జరుగుతుందని తెలిపారు. మిగతా 10 రకాల అభివృద్ధి పనులు జరగలేదన్నారు. గిరిజన గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లు, సీసీ రోడ్డు, డ్రైనేజీ అంగన్వాడీ బిల్డింగ్, విద్యుత్ స్తంభాలు, తాగు నీరు ఏర్పాటు వంటి సదుపాయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జి బుజ్జిబాబు, పి.రంజిత్, పి రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్నబాబు

ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలి

- రంపచోడవరం, చింతూరు డివిజన్ల ప్రజానీకం డిమాండ్
- ఎన్నికల హామీ విస్మరించిన చంద్రబాబుపై ఆగ్రహం

ప్రజాశక్తి - ఎటపాక, విఆర్.పురం, చింతూరు

రంపచోడవరం ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలంటూ ఉద్యమం ఊపందుకుంటోంది. జిల్లాల పునర్విభజన కోసం ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉప సంఘం రంపచోడవరం, చింతూరు డివిజన్లను తూర్పు గోదావరి జిల్లాలో కలిపేందుకు, అలా కానిపక్షంలో అల్లూరి జిల్లాలోనే ఈ ప్రాంతాలను ఉంచి ఓ ప్రత్యేక అధికారితో 'అథారిటీ'ని ఏర్పాటు చేసేందుకు తాజాగా నివేదికలు తయారు చేసి కేబినెట్ ఆమోదానికి పెడుతోందని వస్తున్న వార్తలు ఈ ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రజల ఆకాంక్షలను గుర్తించకుండా ఎలా నిర్ణయాలు చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో రంపచోడవరాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటిస్తామని చంద్రబాబు ఇచ్చిన మాటను వారు గుర్తుచేసుకుంటున్నారు. ఆయన ఆ మాటను నిలబెట్టుకుంటే మంచిదని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు. వాస్తవానికి పాలకులు వారి రాజకీయ ప్రయోజనాల కోసం రంపచోడవరం ప్రజలను బలిపశువులను చేస్తున్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పాటు చేశారు. అప్పటి వరకూ తూర్పు గోదావరిలో ఉన్న రంపచోడవరం ప్రాంతాన్ని తీసుకొచ్చి అల్లూరి జిల్లాలో కలిపారు. అయితే ఈ జిల్లా కేంద్రం పాడేరుకు చింతూరు, ఎటపాక, కూనవరం, విఆర్.పురం మండల వాసులు ఏదైనా అవసరం ఉండి వెళ్లాలంటే 280 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. వెళ్లిరావడానికి సుమారు రెండు రోజులు పడుతోంది. జిల్లా కేంద్రం కంటే రాజధాని కేంద్రానికి వెళ్లి రావడమే సులభమని పలువురు వ్యాఖ్యానించిన సందర్భమూ ఉంది. జిల్లా పునర్విభజన సమయంలో రంపచోడవరాన్ని ప్రత్యేక జిల్లా చేయాలని ఆనాటి ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. పోలవరం నిర్వాసితులకు పూర్తి న్యాయం జరగాలంటే రంపచోడవరం నియోజకవర్గంతో పాటు, పోలవరం నియోజకవర్గంలోని నాలుగు గిరిజన మండలాలు అయిన బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు కలిపి రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలని జిల్లాల పునర్విభజన సందర్భంగా ఆనాడు అఖిలపక్షం డిమాండ్ చేసింది. ఇదే అంశంపై 2022 ఫిబ్రవరిలో అనేక రూపాల్లో అఖిలపక్షం నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఫిబ్రవరి 4న నెల్లిపాకలో జాతీయ రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించింది. 14న కాకినాడ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. 23న ప్రచారజాత నిర్వహించి, 24న రంపచోడవరం నియోజకవర్గం వ్యాప్తంగా రహదారుల దిగ్బంధన కార్యక్రమాలు జరిపారు. ఆ ఆందోళనలను పట్టించుకోకుండా గత ప్రభుత్వం పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేసింది. ఎన్నికల ముందు రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. గెలిచాక ఆ హామీని తుంగలో తొక్కుతూ వచ్చారు.



ఆందోళన చేస్తున్న అఖిలపక్షనాయకులు (ఫైల్ ఫోటో)

చంద్రబాబు హామీని నిలబెట్టుకోవాలి

రంపచోడవరం ప్రత్యేక జిల్లా కోసం సిపిఎం తొలి నుంచీ డిమాండ్ చేస్తూ వస్తోంది. అనేక రూపాల్లో రంపచోడవరం జిల్లా సాధన కోసం కృషి చేశాం. రంపచోడవరం నియోజకవర్గంతో పాటు, పోలవరం నియోజకవర్గంలోని ఆర్‌కె పురం ఐటిడిఎ పరిధిలోని నాలుగు మండలాలు, నాన్ షెడ్యూల్ ప్రాంతంలోని 16 షెడ్యూల్ గ్రామాలను కలిపి రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. దీనికి మద్దతిస్తూ నాడు టిడిపి, జనసేన, సిపిఐ కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. ఇక్కడ ప్రజల ఆకాంక్షను గుర్తించి ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి వాటిని ఓట్ల రూపంగా మార్చుకున్నారు. ఇప్పుడు హామీని నెరవేర్చకుంటే ప్రజల వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుంది. ఈ నియోజకవర్గంలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయి. పోలవరం నిర్వాసితులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు, సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే పోలవరం ముంపులో ఉన్న ఈ మండలాలన్నీ కలిపి ప్రత్యేకజిల్లాగా ఏర్పాటు చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయి.



-బొప్పెన కిరణ్,
సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి

ప్రత్యేక జిల్లా చేస్తే దూరాభారం తగ్గుతుంది

రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా చేయడం వల్ల చాలా దూరంలో ఉన్న పాడేరుకు వెళ్లే అవస్థలు తొలగుతాయి. ఏజెన్సీని నాన్ ఏజెన్సీలో కలపక పోవడమే మంచిది. తూర్పు గోదావరిలో కలిపితే ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో ఆదివాసీలు తీవ్రంగా నష్టపోతారు. ఇప్పటికే జిఒ 3 అమలు చేయకపోవడం వల్ల ఏజెన్సీ ఉద్యోగాల్లో, ప్రత్యేకంగా మొన్నటి డిఎస్‌సిలో గిరిజనులకు పెద్దసంఖ్యలో ఉద్యోగాల్లో నష్టం వాటిల్లింది. ఏజెన్సీ ఆదివాసీ నిరుద్యోగ యువత కూలీ పనులకు వెళ్లాల్సి వస్తోంది.

- చిక్కాల రామారావు, ఉమ్మడివరం

ప్రజల ఆకాంక్షలకు విలువివ్వాలి

రంపచోడవరాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలన్న ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. సుదూర ప్రాంతంలోని పాడేరు నుంచి అధికార యంత్రాంగం ఇక్కడి మండలాలను మానిటరింగ్ చేయటం కష్టతరంగా మారింది. పాడేరు జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రజలు పలు అవస్థలకు గురవుతున్నారు. కాబట్టి రంపచోడవరం జిల్లా కేంద్రంగా చేస్తే మేలు జరుగుతుంది.

- పొడియం లక్ష్మణ్,
చింతూరు

ఉత్పత్తులు విక్రయించే విధంగా స్టాల్స్

ప్రజాశక్తి-రంపచోడవరం : అటవీఉత్పత్తులు, జిసిసి ఉత్పత్తులు, వందన్ వికాస కేంద్రాలు ఉత్పత్తులు, ఐసిడిఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలలకు సరఫరా చేసే ఆహార పదార్థాలు ప్రజలు విక్రయించే విధంగా ఈ నెల 9వ తేదీ ఆదివారం మసీదు వెనక పార్కులో స్టాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఐటిడిఎ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఉత్పత్తులు విక్రయించే విధంగా స్టాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అటవీ ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తామని ఆయన అన్నారు.



అంగన్‌వాడీలకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ వెంకటరావు

గంజాయి నివారణపై అవగాహన

ప్రజాశక్తి- రంపచోడవరం : స్థానిక సిడిపిఒ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాపై ఎస్ఐ వెంకటరావు, సిడిపిఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడు తూ మత్తు పదార్థాలు సమాజాన్ని దెబ్బతీస్తాయని, ప్రజల్లో ముఖ్యంగా యువతలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గంజాయి రవాణా, విక్రయం, కొనుగోలు వంటివి చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటారని సుమారు 10 సంవత్సరాల పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని తెలిపారు.

మారేడుమిల్లి: జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, రంపచోడవరం డిఎస్పి సాయి ప్రశాంత్ ఆదేశాల మేరకు శుక్రవారం మారేడుమిల్లి ప్రభుత్వ కళాశాలలో మారేడుమిల్లి సీఐ నరేంద్ర ప్రసాద్, ఎస్సై శ్రీనివాస్ విద్యార్థులకు గంజాయి డ్రగ్స్ వంటి వాటివల్ల ప్రమాదాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-జికెవీధి: కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని కాఫీ కార్మిక సంఘం జిల్లా మాజీ కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబు విమర్శించారు. మండలంలోని ఆర్‌వినగర్ ముందు శుక్రవారం కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ కార్మికులకు 26 రోజులు పని దినాలు కల్పించాలని, కాఫీ పండ్లు కిలో10 రుపాయలు ఇవ్వాలని ప్లాంటేషన్ వర్కర్స్‌కి పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని పలు డిమాండ్లు పరిష్కారం చేయాలని కోరారు. అనంతరం ఎపిఎఫ్‌డిసి సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాఫీ వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, ప్లాంటేషన్ వర్కర్స్ రాజారావు పాల్గొన్నారు.



ఎపిఎఫ్‌డిసి సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ధారకొండ మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -సీలేరు: ధారకొండ మండల కేంద్రం ఏర్పాటు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు శుక్రవారం గ్రీవెన్స్‌లో మండల సాధన కమిటీ నాయకులు చిటికెలరాము వరప్రసాద్ పోతురాజుకృష్ణ, సుందరరావు, సొన్ను వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందిం నివేదికను ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా అల్లూరి జిల్లా టిడిపి ఇన్‌చార్జి గిడ్డిఈశ్వరికి వినతి పత్రం అందజేశామన్నారు.

జగన్‌ను కలిసిన గంగాధర్

ప్రజాశక్తి -కొయ్యూరు: వైసిపి కార్యాలయం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసినట్టు వైసిపి విద్యార్థి విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రీమల గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని మారుమూల గ్రామంలో వైసిపి సామాన్య కార్యకర్తగా, తదనంతరం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పనిచేసినట్టు తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాశ విశ్వేశ్వరరాజు తన సేవలను గుర్తించి రాష్ట్రస్థాయిలో పార్టీ విద్యార్థి విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.



జగన్‌తో రీమల గంగాధర్



బాధితులకు టార్పాలిన్లు అందిస్తున్న ఎఎస్‌డిఎస్ సిబ్బంది

అగ్నిప్రమాద బాధితులకు ఎఎస్‌డిఎస్ వితరణ

ప్రజాశక్తి -వి.ఆర్.పురం: సీతంపేట గ్రామానికి చెందిన అగ్నిప్రమాద బాధితులు ముత్యాల జయలక్ష్మి, కొట్ల రమణయ్యలకు ఎఎస్‌డిఎస్ సంస్థ వారు శుక్రవారం పరామర్శించి 2 టార్పాలిన్స్, 2 బకెట్స్, మగ్గులు, 2 మ్యాట్స్, బెడ్ షీట్స్ అందించారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు పాయం రామారావు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు పులి సాహెబ్, మాజీ సొసైటీ చైర్మన్ ముత్యాల చంద్రశేఖర్, టిడిపి కన్వీనర్ ముత్యాల అప్పాజీ సంస్థ సిబ్బంది దివ్యాంగుల కోఆర్డినేటర్ నెరుపాటి రవి, రేఖపల్లి క్లస్టర్ కోఆర్డినేటర్ కొవ్వాసి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణసామగ్రి అందిస్తా: జమాల్‌ఖాన్

జెకెసి ట్రస్ట్ చైర్మన్, చింతూరు మండల టిడిపి అధ్యక్షులు మొహ మ్మద్ జమాల్‌ఖాన్ బాధితులను పరామర్శించి ఇంటి నిర్మాణానికి కావలసిన సామాగ్రిని త్వరలోనే అందజేస్తానని తెలిపారు. తక్షణసాయంగా ఒక్కో కుటుంబానికి రూ.3వేల చొప్పున నగదు అందించారు. రెండు కుటుంబాలకు బియ్యాన్ని అందజేశారు.

ఎంఇఒ తాత అబ్బాయిదొరకు
యుటిఎఫ్ నివాళి

అడ్డతీగల- ప్రజాశక్తి: రంపచోడవరం డివిజన్ అడ్డతీగల మండల కేంద్రంలో ఎంఇఒగా పనిచేస్తున్న తాతఅబ్బాయిదొరకు వై.రామవరం బదిలీ అయింది. విద్యార్థులకు యూనిఫాంలు అందలేదని సమాచారం రావడంతో గురువారం ఉదయం అడ్డతీగల నుండి యూనిఫాం తీసుకుని సెనగమొర జిపిఎస్ పాఠశాలకు వెళ్లి దుస్తులను అందజేసి తిరుగు ప్రయాణంలో గురువారం రాత్రి రంపచోడవరం మండలం కాకవాడ గండి సమీపంలో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న సంఘటన లో సంఘటన స్థలంలోనే ఆయన మృతి చెందినట్లు రంపచోడవరం వైద్యులు ధ్రువీకరించారు. ఆయన స్వస్థలం గంగవరం మండలం జగ్గంపాలెం పంచాయతీ రాజవరం. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని బంధువులు తెలిపారు. వారి కుటుంబానికి అడ్డతీగల యుటిఎఫ్ నాయకులు నివాళులర్పించారు. వారి కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ..

గ్రామసభలో తీర్మానం




మాట్లాడుతున్న సర్పంచ్ పెంటమ్మ

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజన జీవన మనుగడను జల సమాది చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా పంచాయతీ గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. టోకూరు పంచాయతీ చిట్టంపాడు గ్రామంలో ఏర్పాటు చేసే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణంతో దిగువ భాగంలో ఉన్న పెద్దబిడ్డ పంచాయితీ గ్రామాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అందుకు వ్యతిరేకంగా పంచాయతీ సర్పంచ్ సాలెపు .పెంటమ్మ అధ్యక్షతన పంచాయితీ. పేసా కమిటీ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ సభ్యురాలు జయశ్రీలు మాట్లాడుతూ, చిట్టంపాడు వద్ద అదాని, నవయుగ కంపెనీలతో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం స్థానిక పంచాయితీ, పేసా. గిరిజనుల ఆమోదం లేకుండా ఏ విధంగా అనుమతులు ఇచ్చిందని ప్రశ్నించారు. హైడ్రో నిర్మాణంతో గిరిజన మనుగడకు తీవ్రంగా నష్టం వాటిల్లితోందని, ఇందుకు వ్యతిరేకిస్తూ పంచాయతీ తీర్మానం చేపట్టామన్నారు.

అనంతరం హైడ్రో పోరాట కమిటీ కన్వీనర్ బి. బుద్రయ్య సభను ఉద్దేశించి మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంతో తమ గిరిజన బతుకులు జల సమాది అవుతుందని, ఇందుకు వ్యతిరేకంగా ఇప్పటికే అనేక సార్లు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. పెద్దబిడ్డ పంచాయతీ ఎనిమిది గ్రామాలు, టోకూరు పంచాయతీ 5 గ్రామాలు, లుంగపర్తి పంచాయతీ 4 గ్రామాల్లో వేలాది ఎకరాల వ్యవసాయ పంట భూములు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. ఎట్టి పరిస్థితిలో అడ్డుకొని తీరుతామని స్పష్టం చేశారు. రాత్రుల సమయంలో డ్రోన్లు ఎగర వేస్తున్నారని, దీంతో పలు గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, తక్షణమే డ్రోన్లు ఎగరకుండా నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ సభ్యులు బి. సమొసన్. వై.నాగరాజు, పి.సన్యాసిరావు, బి .సత్యనారాయణ, గ్రామపంచాయతీ పెద్దలు. వి. వెంకటరావు, ఎస్.పొట్టన్న, కె.చిన్నయ్య, ఎస్. పకీరు దొర, అప్పలస్వామి పాల్గొన్నారు.

మెనూ అమలు చేయకుంటే చర్యలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని ఉప్ప గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో సహాయక గిరిజన సంక్షేమ అధికారి జి. అఖిల శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో అందిస్తున్న భోజన నాణ్యత, టాయిలెట్ పరిశుభ్రత, హాస్టల్ పరిస్థితులు, మెనూ అమలుపై వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఏ.టి.డబ్ల్యూ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడం ప్రతి పాఠశాల నిర్వాహకుల బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం ఆమోదించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.,దీనిలో ఏవైనా మార్పులు లేదా నిర్లక్ష్యాలు చోటు చేసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల ప్రాంగణం, వంటశాల, స్టాక్ రూమ్‌లను స్వయంగా పరిశీలించారు. . పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలపై సూచనలు చేశారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో మెనూ చార్ట్‌ను స్పష్టంగా అతికించాలని ఆమె ఆదేశించారు.గిరిజన ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు మంచి విద్యతో పాటు ఆరోగ్యవంతంగా ఎదగాలంటే పాఠశాలల్లో అందించే భోజన నాణ్యత అత్యంత కీలకమని తెలిపారు. పాఠశాలల్లో పరిశుభ్ర వాతావరణం, సురక్షిత నివాస సదుపాయాలు కల్పించడమే గాక, విద్యార్థుల మనోభావాలను అర్థం చేసుకుని ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఆనందంగా ఉండేలా పాఠశాలలు పనిచేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించకపోతే చర్యలు తీసుకోవడం తప్పదు" అని అన్నారు.



స్టాకును పరిశీలిస్తున్న అఖిల

కొనసాగిన కాఫీ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-పాడేరు:- వేతనాల పెంపు కోసం కాఫీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా మినుములూరు కాఫీ కాలనీలో కాఫీ కార్మికులు విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శన చేసి ధర్నా జరిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాఫీ కార్మికులకు వెంటనే పెరిగిన వేతనాలను అమలు చేయాలని అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కాఫీ కార్మికుల పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు సుందర్రావు, హెల్పర్స్ కాంతమ్మ, సత్యనారాయణ, కార్మికులు వసంత చిన్నాలమ్మ వరలక్ష్మి, దేవి, కన్నానాథ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-చింతపల్లి : ప్రజలు కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షులు రీమల ఆనందరావు అన్నారు. గ్రామంలో నీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో 5000 లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపట్టిందని, ఇది త్వరలో పూర్తవుతుందని తెలిపారు. ఈ ట్యాంక్ ద్వారా గ్రామంలోని ప్రతి వీధికి నీరు అందేలా పైప్‌లైన్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీసీ సెల్ అధ్యక్షులు లక్ష్మణ నాగభూషణం, దూరి రామకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సేవ ఈశ్వరమ్మ స్థానికులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్

ఉత్సాహంగా విలు విద్య పోటీలు

ప్రజాశక్తి-పాడేరు: 69వ ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి విలువిద్య క్రీడా పోటీలు అండర్ 14 ,17, 19 సంవత్సరాల బాల బాలికలకు అల్లూరి సీతారామరాజు జిల్లా వేదికగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్లో శుక్రవారం ప్రారంభించారు ,మొత్తం 13 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు, ఈ పోటీలను అల్లూరి జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ మీట్ డిక్లరేషన్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి ,ఎంపీపీ రత్నకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి పి బ్రహ్మాజీరావు, స్టేట్ అబ్జర్వర్ రమణ నారాయణరావు, డిఎస్‌డి జగన్మోహన్రావు, ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ చైర్మన్ చెరుకూరు సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ రమణ, టెక్నికల్ చైర్మన్ శ్రావణ్ కుమార్, ట్రెజరరీ కష్ణకుమారి పాల్గొన్నారు,

పిఆర్‌టియు కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి డుంబ్రిగుడ :- మండలంలోని అరకు పైనరిలో పి ఆర్ టి యు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి. అప్పలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం అరకు ఫైట్కనరిలో పి ఆర్ టి యు నూతన మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది గౌరవ అధ్యక్షుడుగా టి మోహన్ రావు, అధ్యక్షుడుగా ఏ చిన్ని బాబు, ప్రధాన ప్రధాన కార్యదర్శిగా టి పోలన్న, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్ రాజు, ఉపాధ్యక్షుడు కె నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షులు ఎస్ మహాలక్ష్మి, మహిళ కార్యదర్శిగా పి సరోజిని, మండల కార్యదర్శిగా పి సింహాద్రి, సింహాచలం, సిపిఎస్ మండల అధ్యక్షుడుగా కె. కష్ణ, ట్రెజరర్ గా కె. రామరాజు, వీరిని ఏకీభవంగా ఎన్నుకోవడం జరిగిందని అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు అన్నారు. అనంతరం ఎన్నికైన నూతన కమిటీ మాట్లాడుతూ 2011 కు ముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహించాలని డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి స్కిల్ పోటీలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ కి సంబంధించి డిస్టిక్ లెవెల్ స్కిల్ కాంపిటీషన్ స్థానిక తలారిసింగి స్కూల్ లో నిర్వహించారు. అల్లూరి జిల్లాలో ఉన్న పది ట్రేడ్ కి గాను 146 టీములు, 300 మంది పిల్లలు, ఒకేషనల్ ట్రైనర్స్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వివిధ రకాల ప్రాజెక్ట్ వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించారు. ఒక్కొక్క ట్రేడ్ కి రెండు టీములు చొప్పున మొత్తం 300 మంది పిల్లలు వచ్చారు. ఈనెల 14న స్టేట్ లెవెల్ జరగబోయే కాంపిటీషన్ కి ట్రేడ్ కి ఒక టీం చొప్పున మొత్తం 10 టీం లను సెలెక్ట్ చేశారు.

పిజిఆర్ఎస్‌కు 146 అర్జీలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 146 వినతులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ కె.సాహిత్, డిఆర్ఓ కె.పద్మలత, పాడేరు ఇంచార్జ్ ఆర్ డిఒ ఎ.వి.ఎస్ లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన పిర్యాదులను సంబంధిత శాఖాధికారులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అంతకుముందు సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంత్యుత్సవం సందర్భంగా ఆయన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని..

జి.మాడుగుల మండలం సింగర్ల గ్రామానికి చెందిన వి.ప్రభాస్ నాయుడు వికలాంగుల పెన్షన్ మంజూరుకు, కొయ్యూరు మండలం గోధుమలంకకు చెందిన టి.సీతమ్మ, జి.శ్రీను, జి.సుబ్బారావు, ఎస్.చిన్నమ్మ పిఎం జన్ మన్ గృహాల బిల్లుల మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. పాడేరు గుడివాడకు చెందిన జి.నాగభూషణం మానసిక వికలాంగుల పెన్షన్ మంజూరుకు విన్నవించారు. పెదబయలు మండలం సుంద్రుపుట్టు గ్రామానికి చెందిన బి.చిట్టి బాబు, ఎ.రామయ్య, వి.హరీష్ బాబు గ్రామంలో తాగునీటి సమస్యపై అర్జీ పెట్టారు. హుకుంపేట మండలం గుమ్మడిగుంటకు చెందిన జి.రత్నకుమారి గృహం మంజూరుకు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

విన్నవించారు. ముంచింగిపుట్టు మండలం బరడ పంచాయతీ పిలగండ్వ గ్రామానికి చెందిన ఎస్.పార్వతి బ్రిడ్జి నిర్మాణంకు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ డిడి పిబికె పరిమళ, .డి.కృష్ణ మూర్తి నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, డిఎంహెచ్ఒ డిఆర్ డిఎ పిడి వి.మురళీ, ఆర్అండ్ బి ఇఇ బాల సుందరబాబు, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ ఆఫీసర్ పిఎస్ కుమార్, డిపిఒ కెపి చంద్రశేఖర్, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్‌బాబు, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ.జయప్రకాష్, జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వి రమణారావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.ప్రసాద్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి ఝాన్సీ రామ్ పడాల్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం : దొన్నుదొర



వినతులు స్వీకరిస్తున్న దొన్నుదొర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం రీజినల్ బోర్డు చైర్మన్, అరకు ఇంచార్జీ సియ్యారి దొన్నుదొర ఆధ్వర్యంలో అరకులోయ మండల కేంద్రంలోని తమ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ప్రజల నుంచి 67 వినతులు అందాయి.వీటిలో తాగునీటి సమస్య 17, సీసీ రోడ్లు 32 ,బీటీ రోడ్లు 12, బ్రిడ్జి నిర్మాణం 6,వంటి అంశాలు అధికంగా వచ్చాయి. సియ్యారి దొన్నుదొర ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్నారు.ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపించి, త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ప్రజలతో మమేకమై,సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోని పరిస్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో హుకుంపేట మండల అధ్యక్షులు శతక బొంజుబాబు, డుంబ్రిగూడ మండల అధ్యక్షులు కిల్లో ఆనందరావు, అరకువేలి మండల అధ్యక్షులు లోకోయి మహదేవ్,మాజీ మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, అరకువేలి మండల మహిళా అధ్యక్షులు జ్యోతి, మాజీ ఎంపీటీసీ దూరియ నూకరాజు, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పెదబయలు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.వరహాలమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి వరహాలమ్మ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ప్రజల అవసరాలను తెలుసుకోవాలని, ఏ గ్రామంలో ఏఏ సమస్యలు ఉన్నాయో పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. పంచాయతీ కార్యదర్శుల పని తీరుపై జెడ్పీటీసీ కె.బొంజుబాబు అగ్రహారం వ్యక్తం చేస్తూ పని తీరు మెరుగుపరచు కోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్యాం సుందర్‌రావు, ఏఓ పూర్ణయ్య, వైస్ ఎంపీపీ కె.రాజాబాబు, పాంగి సోనే, ఎంఈఓ కొమ్ము కృష్ణమూర్తి, ఆర్ అండ్ బి అధికారి లక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జగదీష్, అటవీ శాఖ అధికారులు రవిబాబా, సృజన, జిసిసి మేనేజరు అప్పన్న, వైద్యాధికారి నిఖిల్, సీడీపీఓ స్రవంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ బొంజుబాబు

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- హుకుంపేట: మండల కేంద్రంలో పాత పోస్ట్ ఆఫీస్ సమీపంలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.... పాంగి డోంబు తన స్వగ్రామం నుంచి హుకుంపేట వస్తుండగా, అదే సమయంలో జి.తాడేపుట్టు గ్రామానికి చెందిన బోండా ధనుంజయ్ ఎదురుగా బైక్‌పై వస్తున్నాడు. పాత పోస్ట్ ఆఫీస్ సమీపానికి చేరుకోగానే రెండు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు బైకిస్టులకు గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను అంబులెన్స్‌లో పాడేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయిని నిర్మూలించాలి

ప్రజాశక్తి-అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అనంతగిరి మండలంలో గంజాయి సాగు, రవాణా అడ్డుకట్ట వేసేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని ఎస్ఐ. శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం సీడీపీవో. సుగుణ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. గంజాయి రవాణా, సాగువంటి సాగుతో గిరిజన యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. గంజాయి మత్తులో యువత ప్రాణాలు కోల్పోతున్నారన్నారు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. గిరిజన ప్రాంతంలో ప్రశాంత వాతావరణం నెల కొల్పేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది. అంగన్వాడీలు పాల్గొన్నారు

కార్తీక వన సమారాధనను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి -పాడేరు : కార్తీక వన సమారాధన వారోత్సవాలు పండగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ అన్నారు. జిల్లాలో ఫారెస్ట్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యక్రమముగా వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, ప్రకృతి పాత్ర గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లా పరిధిలో ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్ళాలని, విద్యార్థులు, డ్వాక్రా సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పెద్ద యెత్తున పాల్గొనాలన్నారు. పెద్ద యెత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం, విద్యార్థులకు, డ్వాక్రా సంఘ సభ్యులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వన సమావేశాలు పండగ వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను, ప్రజలను ఈ కార్యక్రమములో భాగస్వాములను చేయాలన్నారు. ఈ కార్యక్రమములో డిఆర్డిఏ పిడి వి. మురళి, డ్వామా పిడి వి.విద్య సాగర్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె. బాలకర్ణ, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి బాబు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.వి. రమణా రావు, రహదారులు భవనాల శాఖ ఈఈ బాల సుందర బాబు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి. ప్రసాద్, మూడు ఐటిడిఏ పరిధిలోని ఫారెస్ట్ అధికారులు, ఐటిడిఏ ఎపివో వేంకటేశ్వర్లు, ఎమ్ పిడివోలు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని సంతారి పంచాయతీ రూడి గ్రామానికి చెందిన తాంగుల రామ్ సాయి జాతీయ స్థాయి కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించాడు. రామ్ సాయి విశాఖపట్నంలోని ఇండియన్ నేవీ అకాడమీ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. పాడేరు మండలం సలుగు పంచాయతీ చీడిమెట్ట గ్రామానికి చెందిన తామర్ల రమేష్ బాబు కూడా బ్రౌన్ బెల్ట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఇతను సబ్బవరం ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో చదువుతున్నాడు. జిల్లా కోచ్ నందదొర రామారావు పత్రిక ప్రకటనలో తెలిపారు. గిరిజన ప్రాంతానికి చెందిన విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం గర్వకారణమని ఆయన అభినందించారు. ఇంకా మరెందరో విద్యార్థులు క్రీడా రంగంలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. విజయవాడ రవీంద్ర కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్లో ఈ యువకులు ప్రతిభ కనబరిచారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే శిరీషాదేవి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి- గంగవరం : దరఖాస్తుదారులు అందించిన ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆ దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. గంగవరం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆమె మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి అధ్యక్షతన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు చాలా వరకూ నెరవేర్చిందని తెలిపారు. రంపచోడవరం ప్రత్యేక జిల్లా చేయాలని, ఆముదాల బంద గ్రామానికి విద్యుత్ సమస్య పరిష్కరించాలని, కొత్తడ పునరావాస కాలనీకి రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, పంచాయతీ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేసిన వారిపై చర్యలు తీసుకో వాలని కోరారు. నెల్లిపూడిలో కుంతీదేవి గుడి నిర్మాణం చేపట్టాలని, ఎల్లాపురంలో పాఠశాలకు నూతన భవనం నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరారు. కొండ పోడు భూములకు పట్టాలు కావాలని కోరారు. స్వీకరించిన ప్రతీ దరఖాస్తుకు దరఖాస్తు దారుని ఫోన్ నంబర్, ఆధార్ నెంబర్‌తో నమోదు చేసి పురోభివద్ధి చర్యలు తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆమె వెంట నియోజకవర్గపార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాసయాదవ్, మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి, అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజన సొసైటీలకు హోంస్టేలు అప్పగించాలి

ప్రజాశక్తి- మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలంలో హోంస్టేలు విషయంలో ఐటిడిఎ పిఒ నిర్ణయం మార్చుకోవాలని, గిరిజన సొసైటీలు ఏర్పాటు చేసి, వాటికి హోం స్టేలు అప్పగించాలని, తద్వారా ఆదివాసీ యువత అభివృద్ధికి తోడ్పడాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి, పుల్లంగి సర్పంచ్ వి.జార్జిబాబు తదితరులు డిమాండ్ చేశారు. గిరిజనేతర బినామీలు హోంస్టేలను ఉపయోగించుకోవాలని చూస్తున్నారని, ఇప్పటికి మారేడుమిల్లిలో నడుస్తున్న రిసార్ట్‌లు మొత్తం అన్నీ బినామీ పేర్లతోనే నడుస్తున్నాయన్నారు. హోంస్టేల వల్ల ఆదివాసులకు నష్టం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని ఓ ప్రకటనలో తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - జీకేవీధి : జికె వీధి పిహెచ్‌సి పరిధిలోని రింతాడ- 1 ఉప కేంద్రంలో కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ కేన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. ఎంపిహెచ్ఇఒ పోతురాజు, ఎంటిహెచ్ శ్రావణి ఎమ్ఎల్‌హెచ్‌పి నిర్మల , హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎం యోగిత, సచివాలయం ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'వందేమాతరం' స్వాతంత్ర్యోద్యమంలో ఒక మలుపు



సీలేరు: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



రంపచోడవరం: వందేమాతరం ఆలపిస్తున్న పిఒ స్మరణ్‌రాజ్



జి.మాడుగుల: ప్రైవేట్ పాఠశాలలో వందేమాతం గీతాలాపన

ప్రజాశక్తి - రంపచోడవరం : వందేమాతర గీతం స్వాతంత్ర్యోద్యమంలో ఒక మలుపని పిఒ స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయ ప్రాంగణంలో రెవిన్యూ డివిజనల్ అధికారి అంబేద్కర్, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయిప్రశాంత్, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఇఇ శ్రీనివాసరావు,అడిషనల్ డి ఎంహెచ్ ఓ డాక్టర్ సరిత, తహశీల్దార్ బాలాజీ ఉపాధ్యాయులతో వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

చింతూరు: స్వాతంత్ర ఉద్యమానికి స్ఫూర్తిని ఇచ్చింది వందేమాతర గీతమేనని, ఎఎస్పీ హేమంత్ పేర్కొన్నారు. చింతూరు పోలీస్ స్టేషన్ ఆవరణంలో శ్రీ భాస్కర విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులచే వందేమాతరం ఆలపించారు. సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వందేమాతరం గీతం ఆలాపిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ప్రిన్సిపాల్ శంకరరావు వందేమాతరం ప్రాధాన్యత వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఎపి జెన్ కో ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: ప్రతీ భారతీయుడూ జాతీయతా భావాన్ని కలిగి ఉండాలనిఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో వందేమాతరం ఆలాపన నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాసయాదవ్, మండలపార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి, రాష్ట్ర రైతు అధికారి ప్రతినిధి కనిగిరి రాంబాబు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: కొమ్మిక బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



మారేడుమిల్లి: పోలీస్‌స్టేషన్‌లో వందేమాతరం గీతాలాపన

'వందేమాతరం ఆలాపన ఘనంగా నిర్వహించారు. హెచ్ ఎం సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డతీగల: బొడ్డలంక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎంపిడిఒ కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ రాఘవ అధ్యక్షతన వందేమాతరం ఆలాపన నిర్వహించారు. విద్యార్థులతో ఎంపిడిఒ వందేమాతరం ఆలపించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్‌పురం: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సాయిరమణ ఆధ్వర్యంలో వందేమాతర గీతాన్ని ఆలపించారు. ప్రిన్సిపల్ వందేమాతర గీతం ప్రాముఖ్యతను వివరించారు. సీనియర్ అసిస్టెంట్ మద్దాల చినబాబు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: పోలీస్‌స్టేషన్ ప్రాంగణాల్లో వందేమాతరం సామూహిక గీతాలాపనను చేసినట్లు సిఐ గోపి నరేంద్రప్రసాద్ తెలిపారు. సిఆర్‌పిఎఫ్ 42సి బెటాలియాన్ కంపెనీ కమాండెంట్ సుజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

చింతపల్లి : స్థానిక విజ్ఞాన భారతి పాఠశాలలో వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జి.మోహన్‌రావు, ప్రధానాచార్యులు పి.వెంకటేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని సామూహంగా ఆలపించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిమాడుగుల: వందేమాతరం 150 ఏళ్ల సంబరాలు పురస్కరించుకొని మండల కేంద్రంలో స్థానిక విజ్ఞాన భారతి ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సందర్భంగా వందేమాతరం గేయాన్ని అద్భుతంగా అనిపించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ మత్స్యరాస మధ్య రాజు, రమేష్ కుమార్, ప్రిన్సిపాల్ , డెవలప్మెంట్ కమిటీ సభ్యులు కిముడు వెంకటరమణ, కిముడు వంశీకృష్ణ, కిముడు త్రివేణి పాల్గొన్నారు.

అనంతగిరి: వందేమాతరం జాతీయ గీతం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని ఎస్ఐ డీ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం వందేమాతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ, వందేమాతరం గీతం దేశ భక్తికి చిహ్నంగా మారిందన్నారు. చిలకలగెడ్డ మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులు ఈ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ: భారత దేశ జాతీయ గేయం అయిన వందేమాతరం కు 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అరకులోయ విజ్ఞానభారతి(బి.వి.కె) పాఠశాలలో విద్యార్థులందరు ప్రత్యేకంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కృష్ణారావు మాట్లాడుతూ వందేమాతరం జాతీయ గేయం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ కాపు కృష్ణారావు,విజ్ఞాన భారతి పాఠశాల హెచ్ఎం కె.వెంకట్‌రావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రగతిపై సంతృప్తి

ప్రజాశక్తి- మారేడుమిల్లి : ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకులాల్లో ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న మైల్ ప్రోగ్రాంను సాము టీం మెంబెర్ జి. జాన్సన్ దేవరాజు శుక్రవారం మారేడుమిల్లి గురుకుల పాఠశాలను సందర్శించి మైల్ ప్రోగ్రామ్ ప్రగతిని విద్యార్థులను స్వయంగా అడిగి, చదివించి, వ్రాయించి తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రగతి విషయంలో సంతృప్తి వ్యక్తం చేసారు. ఉపాధ్యాయులు మరింత కృషి చేసి, ఈ మైల్ ప్రోగ్రామ్‌ను సక్సెస్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి వెంకయ్య, మారేడుమిల్లి గురుకుల కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ పుల్లారావు, ఆనంద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మైల్ ప్రోగ్రాం టీం

నేషనల్ పార్క్ సెన్సిటివ్ జోన్‌ను వ్యతిరేకిస్తున్నాం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని వేములకొండ పంచాయతీ వివిధ గ్రామాల ప్రజలు నేషనల్ పార్క్ సెన్సిటివ్ జోన్లను ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నామని గిరిజన సంఘం రంపచోడవరం మండల అధ్యక్షులు సాదల విద్యాసాగర్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ పార్క్, సెన్సిటివ్ జోన్ల అనుమతి కొరకు సర్పంచ్ కొమరం పండుదొర అధ్యక్షతన సెలకవీధిలో గ్రామసభ 'నిర్వహించడం జరిగిందని సర్పంచ్ ఆధ్వర్యంలో ఏక గ్రీవంగా సెన్సిటివ్ జోన్లను వ్యతిరేకిస్తూ తీర్మానం ఆమోదించామన్నారు. కుర్లా రమణారెడ్డి, కుర్ల బండిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టడం తగదు

ప్రజాశక్తి-కొయ్యూరు: కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో పెట్టడాన్ని తీవ్రం గా ఖండిస్తున్నామని మాజీ ఎంపి గొట్టేటి మాధవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ కోసం కొయ్యూరు మండలం డౌనూర్‌లో స్థల సేకరణ చేసి ప్రాసెసింగ్ యూనిట్ కోసం శంకుస్థాపన చేశారని అక్కడే నిర్మించాలని స్పష్టం చేశారు. డౌనూరులో కొన్ని గ్రామాల్లో చాలా వరకు నర్సీపట్నంలో ఉన్న ఉష్ణోగ్రతల మాదిరిగానే ఉంటుంది కాబట్టి అక్కడ పెట్టవచ్చు అన్నారు. కానీ ఇప్పుడు వివిధ కారణాలతో మాకవరపాలెంలో పెట్టి డౌనూరులో గోడౌన్ కింద మాత్రమే వాడుకుంటామని అధికారులు చెబుతున్నారని దీనివల్ల ఎవరికీ ఉపయోగం ఉండదని దీని గురించి చర్చించి గిరిజన ప్రాంతాల్లో కొయ్యూరులో ఉన్న కింద గ్రామాల్లో ఏదో ఒక ప్రదేశంలో ప్రాసెసింగ్ యూనిట్ పెట్టాలని డిమాండ్ చేశారు. సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి లేఖ రాస్తామని తెలియజేశారు.